# చదువు

అక్టోబరు నెలలో బదిలీ వచ్చింది. పెట్టే, బేడా పట్టుకుని భార్యాపిల్లల్ని తీసుకుని ఊరు మారేను.

కొత్త ఊరో పెద్ద టౌను. అయినప్పటికీ ఇల్లూ, గేస్ కనెక్షన్, రేషన్ కార్డు వగైరాలు తేలిగ్గానే అమిరాయి. ఆ తర్వాత మా బాబి గాణ్ని చేర్చడానికి స్కూలు వేటలో పడ్డాం.

టౌన్లో బాగా పేరున్న ఆ కాన్వెంటు స్కూల్లోనే చేర్చమని సలహా ఇచ్చారు ఆఫీసువాళ్లు. అందులో సీటు దొరకటం చాలా కష్టమన్నారు కొందరు. సీటు దొరికితే మీరు నక్కని తొక్కి వచ్చినట్టే అనేశారింకొందరు.

ఎందుకైనా మంచిదని ఆడిటర్తో సిఫార్సు చేయించేను. వారితో మాట్లాడేననీ, వెళ్లి కలవమనీ చెప్పేడాయన.

మా బాబిగాణ్ని తీసుకుని వెళ్లేం నేనూ, మా ఆవిడా. వాళ్లడిగే ప్రశ్నలకి ధైర్యంగా జవాబులిమ్మని దారి పొడవునా నూరి పోస్తూనే వుంది మా ఆవిడ.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందా కాన్వెంటు. పదెకరాల స్థలం, పెద్ద పెద్ద భవనాలు, ప్రహారీ గోడ – చాలా దర్జాగా ఉంది స్కూలు.

స్కూటర్ని గేటు బయటే పార్కు చేసి లోపలో ఫర్లాంగు దూరం నడిచి ఆఫీసు రూంలోకెళ్లాం.

హొటల్లోని రిసెప్షన్ కౌంటార్లాంటి కౌంటర్లో ఒకామె కూర్చునుంది. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి కుర్చీలు చూపించింది.

నా విజిటింగ్ కార్డు ఇచ్చి "కరస్పాండెంట్ని కలవాలి" అన్నాను.

కార్డుని లోపలికి పంపించింది. ఓ పది నిముషాలకు ఇంటర్ కమ్ మోగింది. రిసీవరెత్తి మాట్లాడి, "మీరే పని మీద వచ్చార్సార్?" అనడిగింది.

"మా అబ్బాయిని మీ స్కూల్లో చేర్పిద్దామని ...."

"మిడ్ అకడెమిక్ ఇయర్లో చేర్చుకోం సార్"

"మా ఆడిటర్ మాట్లాడారు. రమ్మని చెప్పేరని చెప్పండి"

ఆమె చెప్పి రిసీవర్ పెట్టేసింది.

"జోళ్లు తీసేసి లోపలికెళ్లండి సార్" దారి చూపించింది.

ఏసీ రూంలో అడుగు పెట్టాం. సఫారీ సూట్లో ఉన్నారు నలభైఅయిదేళ్ల కరస్పాండెంట్ విష్ చేశాను.

"మిస్టర్ సుబ్బారావ్ చెప్పేరు. కాని మిడ్ ఇయర్లో చేర్చుకోం. అది మా పోలసీ"

"మావి బదిలీలయ్యే ఉద్యోగాలు. మాలాటి వారిక్కొంచెం కన్సెషన్ ఇవ్వాలి" అని నేనంటే, "మీస్కూలు గురించి చాలా గొప్పగా విని ఇక్కడే చేర్చాలనొచ్చాం" అంది మా ఆవిడ.

మా బాబిగాడు బిక్కుబిక్కుమంటూ చూశాడు.

"మేం స్టేండర్డ్ మెయిన్‌టెయిన్ చేస్తాం. యూ నో, టెన్త్‌లో మాది హండ్రడ్ పర్సెంట్ పాస్. ఎయిటీ పర్సెంట్ ఫస్ట్ క్లాస్. సరే.. మీ సన్‌ని టెస్ట్ చేస్తారు. రిపోర్టొచ్చేక ఆలోచిస్తాను"

ఇంటర్‌కమ్‌లో ఎవర్నో పిలవగా ఒకవిడొచ్చి మా వాణ్ని పక్క రూంలోకి తీసుకెళ్లింది.

బితుకుబితుకు మంటూ వెళ్లేడు వాడు.

"ఎంట్రన్స్ టెస్ట్‌కి హండ్రెడ్ రూపీస్ ఆఫీసులో కట్టేసి లాంజ్‌లో కూర్చోండి"

బయటికొచ్చి రిసెప్షనిస్ట్ దగ్గర కూర్చున్నాం. గంటయ్యింది. బాబిగాడు రాలేదు. ఇంతసేపు ఏమేం పరీక్షలు నిర్వహించేస్తున్నారో అర్థం కాలేదు. నాకంటే మా ఆవిడకి మరీ టెన్షన్‌గా ఉంది.

మరో అరగంటకు వచ్చాడు. తడిపి పిండిన బట్టలా ఉన్నాడు.

"ఏవిరా కన్నా?" ఎదురెళ్లి కర్చీఫ్‌తో వాడి ముఖం తుడిచింది మా ఆవిడ.

"మీరు వెళ్లొచ్చు. రిజల్ట్స్ రేపు నోటీసు బోర్డులో పెడతాం"

నివ్వెరపోయాం. "ఏదో మెడిసిన్ సీటు ఇస్తున్నట్టుగా మాట్లాడుతున్నారే! కరెస్పాండెంటును కలుస్తాం"

"ఇప్పుడు కుదరదు సార్"

"ఏం? ఆయన ఐఏస్సా?"

"అబ్బే. అండర్ గ్రాడ్యుయేట్..." గబుక్కున అనేసి నాలిక్కరుచుకుంది.

ఆవిడ ఇంటర్‌కమ్‌లో కంగారుగా మాట్లాడి పరుగున వెనకే వచ్చి "జోళ్లు తీసేసి వెళ్లండి సార్" అంది.

అలాగే చేసి వెళ్లాం.

"రిపోర్టొచ్చింది. మీ సన్ పెర్ఫార్మెన్స్ వెరీ పూర్. ఏం బావోలేదు. రీడింగ్ ఓకే. కాని ప్రొనౌన్సియేషన్ బిలో యావరేజ్. రైటింగ్ జస్ట్ యేవరేజ్. జీకే ఓకే. తెలుగు యావరేజ్. ఇంగ్లీష్ గ్రాస్పింగ్ పూర్. బొత్తిగా స్టేండర్డ్ లేదు!" పెదవి విరిచేశాడు!

మా ముఖాలు నల్లగా మాడి పోయాయి. బాబిగాడి ముఖం ఎలా ఉందో గాని వాడి వంక చూసే ధైర్యం లేక పోయింది. కానొక్కటి. మా వాడి స్టేండర్డ్ ఆయన చెప్పినంత దారుణంగా లేదని ఖచ్చితంగా చెప్పగలను. వాడు మెరిట్ స్టూడెంట్. మంచి ఐక్యూ ఉంది. ఒకటి రెండు కప్పుల్ని కూడా గెల్చుకున్నాడు. వాడి టీచర్లంతా పొగిడిన వారే. అలాటి దీయన.....?

"కొత్త కదా కంగారు పడి ఉంటాడు. మొదట్నుంచీ కూడా ఫస్ట్ లేదా సెకండ్ ర్యాంక్ తెచ్చుకుంటున్నాడు" మా ఆవిడ అంది.

"వీధికో స్కూలూ, రోడ్డుకో కాన్వెంటూ ఉంటున్నాయి. వాటిల్లో రావొచ్చు. కాని మా స్కూల్ స్టేండర్డ్‌కు సరిపోడు!"

మా ఆవిడకు రోషం పొడుచుకొచ్చింది.

"మా వారు ఆఫీసర్.మేం ఇద్దరం పోస్టు గ్రాడ్యుయేట్సుమి. మేం ఇంత క్రితం ఉన్న ఊళ్లోని స్కూలూ మంచిదే. ఉన్నంతలో బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని మా తాపత్రయం తప్ప ఏవో వానా కాలపు చదువు చదివించాలని మేం అనుకోలేదు!"

"అఫ్‌కోర్స్. ఆ ఊరికదే ఆముదపు మహావృక్షం అయ్యుండొచ్చు" నవ్వేడతను.

నాకు ఒళ్లు మండింది. అయినా సహించుకున్నాను. "చేర్చుకుని చూడండి. మీ సో కాల్డ్ స్టేండర్డ్సు అందుకోలేకపోతే అప్పుడు తీసుకెళ్లిపోతాం"

"మిస్టర్ సుబ్బారావ్ చెప్పేరు గనుక ఓకే " అని ఇంటర్‌కమ్‌లో ఏదో చెప్పగా ఒకావిడ అప్లికేషన్ తెచ్చిచ్చింది.

కట్టాల్సిన ఫీజు వివరాలు చూసి బ్రాన్పడి పోయాం!

అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్పెషల్ ఫీజు, రెండు టెరముల ఫీజు, జూన్ నుంచీ వేన్ ఫీజు వెరసి 8500 కట్టాలిట !

"ఫస్ట్ టరమ్ ఇక్కడ చదవక పోయినా ఫీజు కట్టాలా?"

"ఎప్పుడు చేరినా మొత్తం ఇయర్ ఫీజు కట్టాల్సిందే. అసలు మీకు సీటు ఇవ్వటమే గొప్ప. మీ కుర్రాడిది బిలో స్టేండర్డ్ - రికమెండేషన్ వల్ల గాని, లేకపోతే అడ్మిషనివ్వను. చెట్టు కింద నిలబెట్టి చదివించినట్టుంది స్టేండర్డ్!"

నేనిహ నా కోపాన్ని అదుపు చేసుకోలేకపోయాను.

"ప్లీజ్ హెూల్డ్ యువర్ టంగ్! నేను మిమ్మల్ని ఇంజనీరింగు సీటో, మెడిసిన్ సీటో ఇమ్మనటం లేదు. కేవలం రెండో క్లాసులో సీటిమ్మన్నాను. దాని కెంత ఆర్భాటం చేస్తున్నారు! ప్రతిభను ప్రోత్సహించటం కాదు, అసలు గుర్తించటమే మీకు తెలీదని నాకు అర్థమైంది. ఫీజులు స్కూలు స్టేండర్డ్‌కు కొలబద్ధకాదన్న సంగతి తెలుసుకోండి. మా వాడికి చదువు రాకపోయినా పర్లేదు కాని ఇలాంటి స్కూల్లోని చదువొద్దు! ఈ కుసంస్కార వ్యాపార పటాటోపాలూ వద్దు! మీకూ, మీ సీటుకూ, మీ స్కూలుకూ ఓ నమస్కారం!"

స్లిప్ అతడి మీదికి విసిరేసి వచ్చేశాం.

**(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 22.9.1997)**